ప్రజాశక్తి
గురువారం 21 ఆగస్టు 2025 5 అనంతపురం

నడవలేని స్థితిలో ఉన్న చిన్నారిని కార్పొరేషన్ కార్యాలయానికి తీసుకొచ్చిన తల్లిదండ్రులు

వికలాంగులకు పింఛన్ కష్టాలు

కార్పొరేషన్ వద్ద పడిగాపులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రీ వెరిఫికేషన్ పేరుతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వికలాంగులకు పింఛన్ కష్టాలు మొదలయ్యాయి. పింఛన్ తీసుకునేందుకు అన్ని అర్హతలున్నా జాబితాలో అనర్హులని రావడంతో వికలాంగులు కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. రీవెరిఫికేషన్‌లో భాగంగా అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వెయ్యికి పైగా వికలాంగ పింఛన్లను తొలగించారు. ఈ నెల 14వ తేదీన సచివాలయ సిబ్బంది అనర్హుల జాబితాను ఆయా సచివాలయాల్లో అతికించి సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. నగరంలోని 11వ అవార్డు పరిధిలోని ప్రభాకర్ స్ట్రీట్‌లో 13 సంవత్సరాల వేలూరు ధీరజ్ వెంకటనాథ్ నడవలేదు. పూర్తిగా మంచానికే పరిమితమై ఉంటాడు. ధీరజ్ వెంకటనాథ్‌కు ఐడి నెం:112772819 కింద వికలాంగ పింఛన్ నెలకు రూ.6వేలు వస్తుండేది. రీ వెరిఫికేషన్‌లో భాగంగా పరిశీలించిన వైద్యులు ఇతనికి 40 శాతం తక్కువ వికలత్వం ఉన్నట్లు ధృవీకరణ చేశారు. దీంతో ఇతని పేరు అనర్హుల జాబితాలో వచ్చింది. నడవలేకుండా మంచానికే పరిమితం అయిన కుమారున్ని తల్లిదండ్రులు ఎత్తుకుని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చారు. ఆ పిల్లవాడిని చూసిన వారు ఎవరైనా అతని పింఛన్‌కు అర్హుడని చెబుతారు. అలాంటిది వైద్యులు ఎలా పరిశీలన చేసి 40 శాతం లోపుగానే వికలత్వం ఉందని ధ్రువీకరణ చేశారో వారికే తెలియాలి. తాత్కాలిక వైకల్యం అంటూ వైద్యులు ధ్రువీకరణ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

నగరంలోని 41వ వార్డు పరిధి జనశక్తి నగర్‌కు చెందిన వి.కుషితకు కాళ్లూ చేతులు పనిచేయవు. అన్నం తినిపించే దగ్గర నుంచి ఇతర అన్ని సపర్యలూ తల్లిదండ్రులే ఈ చిన్నారికి చేయాలి. గత నెల వరకు చిన్నారికి రూ.6వేల పింఛన్ వచ్చేది. బుద్ధిమాద్యంతో బాధపడుతున్న ఈ చిన్నారి పింఛన్‌ను కూడా రద్దైనా జాబితాలో వచ్చింది. తాత్కాలిక వైకల్యం పేరుతో ఈ పింఛన్‌ను కూడా తొలగించారు. ఇలా నగరంలో చాలా మంది పింఛన్ తీసుకునేందకు అర్హత ఉండి కూడా అధికారులు, వైద్య సిబ్బంది తప్పిదాలతో ప్రభుత్వ సాయానికి దూరం అవుతున్నారు. గత మూడు రోజులుగా ఇలాంటి బాధితులు కార్పొరేషన్ కార్యాలయం వద్దకు వచ్చి అధికారులతో వారు గోడును వెల్లబోసుకుంటున్నారు. వికలాంగుల పింఛన్ల రద్దు విషయంలో ప్రభుత్వానికి ఆర్థిక భారం తొలగించడమే లక్ష్యంగా ప్రత్యేక వైద్య బృందాలు పనిచేశాయన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. తక్షణం అనర్హుల జాబితాను రద్దు చేసి క్షేత్రస్థాయిలో పారదర్శకంగా వికలాంగులను పరిశీలించి వికలత్వ సర్టిఫికెట్లు అందించాలని బాధితులు కోరుతున్నారు.

వార్2 'దగ్గుపాటి' పై వార్..!

- ఎమ్మెల్యేను వెంటాడుతున్న వివాదాలు
- ఆడియో వైరల్ నేపథ్యంలో జూ॥ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఫైర్
- క్షమాపణ చెప్పకపోతే 'చలో అనంత'కు పిలుపు

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌పై వార్-2 సినిమా వివాదం కొనసాగుతోంది. ఈ సనిమా విడుదల సందర్భంగా ఎమ్మెల్యే జూనియర్ ఎన్టీఆర్‌పై చేసిన వ్యాఖ్యల ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. జూ॥ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆయన వ్యాఖ్యలపై మండిపడుతున్నారు. అనంతపురం నగరం నడిబొడ్డున ఆయన ఎన్టీఆర్‌కు క్షమాపణ చెప్పకపోతే దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. అంతేకాకుండా చలో అనంతపురం కార్యక్రమాన్ని చేపడతామని జూ॥ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు నరేంద్ర చౌదరి హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. అసలు ఈ సమావేశామే అనంతపురంలో పెట్టాల్సి ఉన్నప్పటికీ పోలీసుల ఒత్తిడితో అక్కడ పెట్టలేకపోయామని ఆయన చెప్పారు. రాష్ట్రంలో అన్ని చోట్లా నిరసనలు జరగనీయకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని తెలిపారు. ఎమ్మెల్యే ఇప్పటికైనా బహిరంగంగా క్షమాపణ చెప్పకపోతే నిరసనలు చేపడతామని హెచ్చరించారు. జూనియర్ ఎన్టీఆర్ తల్లి గురించి మాట్లాడటం విచారకరమన్నారు. పద్ధతి మార్చుకోకపోతే తగిన విధంగా స్పందిస్తామని హెచ్చరించారు.

ఆది నుంచి వివాదాలు

ఆది నుంచి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ చుట్టూ వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆయన ఏదోక సందర్భంలో చేస్తున్న వ్యాఖ్యలు దుమారం రేపుతూనే ఉన్నాయి. ఎమ్మెల్యే అయిన తొలినాళ్లలో అనంతపురం ఆఫీసర్స్ క్లబ్‌లో పేకాటకు అనుమతిని ప్రభుత్వం నుంచి ఇప్పిస్తామనని చేసిన వ్యాఖ్యలు విమర్శలకు దారితీసాయి. పేకాటను ప్రోత్సహించే విధంగా మాట్లాడారని పలువురు వ్యాఖ్యానించారు. ఆ తరువాత టిడిపి నాయకుడు సుధాకర్‌నాయుడును హత్యకు కుట్ర పన్నారన్న ఆరోపణలు పెద్ద చర్చనీయాంశమైంది. అధిష్టానం కూడా దీనిపై పిలిపించి మాట్లాడినట్టు సమాచారం. పోలీసులు దీనిపైనా కొంత వరకు విచారించి సమస్యను సద్దుమణిచారు. దాని తరువాత అనంతపురం నగరంలో వరుసగా భూ సమస్యలు వెలుగులోకి వచ్చాయి. రాత్రిరాత్రి ప్రయివేటు భూములు ఇతరుల పేర్ల మీదకు మారిపోతుండటం పెద్ద చర్చకు దారితీశాయి. దీనిపై ఆయన నేరుగా స్పందించి అదంతగా మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి తనపై కుట్ర పన్నారని ఆరోపించారు. దీనిపై ఆయన కూడా స్పందించారు. దగ్గుబాటి ప్రసాద్ చర్యలు సరిగాలేవని నేరుగా ప్రభాకర్ చౌదరి ఆరోపించారు. ఇది నడుస్తున్న క్రమంలోనే జూనియర్ ఎన్టీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ ఫ్యాన్స్ దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ వ్యాఖ్యలపై మండిపడుతున్నారు. ఆయన తక్షణం క్షమాపణ చెప్పకపోతే ఇంటి కాడికి వచ్చి ఆందోళన చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

ఎమ్మెల్యేకు చంద్రబాబు పిలుపు

జూనియర్ ఎన్టీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా దుమారం రేగిన నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును బుధవారం నాడు కలిశారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై ఆరా తీసినట్టు సమాచారం. ఇప్పటికే దగ్గుబాటు తీరుపై మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆయన వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది

రతన్‌టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జెఎన్‌టియులో రతన్‌టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభిస్తున్న కలెక్టర్

అనంతపురం జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. మంగళగిరి నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా బుధవారం దీనిని ప్రారంభించారు. జెఎన్‌టియు నుంచి కలెక్టర్ డా॥వినోద్ కుమార్ రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ కృష్ణయ్య పాల్గొన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌ను రిబ్బన్ కట్ చేసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రపంచ అవసరాలు తీర్చే స్టార్టప్ కేంద్రంగా విలసిల్లేలా కార్యాచరణకు సిద్ధంగా ఉందన్నారు. కుటుంబానికో పారిశ్రామికవేత్త నినాదంలో భాగంగా రాష్ట్రవ్యాప్త గ్రిడ్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. వినూత్నమైన కొత్తకొత్త ఆలోచనలున్న యువతను ముఖ్యమంత్రి గుర్తించి ఆంధ్రప్రదేశ్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారని చెప్పారు. జిల్లాలో నాలెడ్జ్ పార్టనర్‌గా సెంట్రల్ యూనివర్సిటీ, జెఎన్‌టియు ఉన్నాయన్నారు. ఇన్నోవేషన్ హబ్‌కు డైరెక్టర్‌గా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఉన్నారని తెలిపారు. అంతకుముందు రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ నందు వివిధ సంస్థలు, స్టార్టప్స్, పరిశ్రమల ప్రతినిధులు ఏర్పాటు చేసిన కౌంటర్లను కలెక్టర్, ఇతర అధికారులు పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి జి.రవిశంకర్ రెడ్డితో పాటు పలు పరిశ్రమల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



మంగళగిరి నుంచి వర్చువల్‌గా ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

సిపిఎం పోరాటం న్యాయమైనది.!

- ప్రజా అవసరాల కోసం బ్రిడ్జి నిర్మించాల్సిందే
- సిపిఎం పోరాటానికి పెరుగుతున్న మద్దతు
- 3వ రోజు ర్యాలీ, మోకాళ్లపై నిలబడి నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజలతో కలిసి మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

వాహనదారుల రాకపోకల సౌకర్యార్థం వారి ప్రాణాలను కాపాడేందుకు అనంతపురం నగరంలోని రిషిత పబ్లిక్ స్కూల్ దగ్గర బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు ప్రజల మద్దతు పెరుగుతోంది. సిపిఎం చేస్తున్న పోరాటం న్యాయమైనదంటూ పలువురు నిరసనలో భాగస్వామ్యం అయ్యి మద్దతు తెలుపుతున్నారు. బుధవారం 3వ రోజుకు చేరుకున్న నిరసన దీక్షల్లో నగర డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు లింగమయ్య, లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, 47, 48 డివిజన్ల కార్పొరేటర్లు రామచంద్ర, శ్రీనివాసులు, మెడికల్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు రామమునిరెడ్డిలు పాల్గొని సంఘీభావం తెలిపారు. నిరసనలో భాగంగా సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి ఆధ్వర్యంలో నీలిమ సర్కిల్ నుంచి రిషిత పబ్లిక్ స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం దీక్షా శిబిరంలో మోకాళ్లపై నిలబడి నిరసన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం, రోడ్ల మరమ్మతుల కోసం సిపిఎం చేస్తున్న ఆందోళన న్యాయమైనదన్నారు. అనంత నగరపాలక వర్గం, జిల్లా అధికార యంత్రాంగం దీనిపై స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిత్యం ప్రజల రాకపోకలు జరుగుతున్న రిషితా స్కూల్ వద్ద రోడ్డు చాలా అధ్వానంగా ఉందన్నారు. వర్షం వస్తే మరి అధ్వాన పరిస్థితులు ఉన్నాయన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు లింగమయ్య మాట్లాడుతూ నగరంలో ఎక్కడ చూసినా రోడ్లన్నీ గుంతల మయం అయ్యాయన్నారు. పరిష్కరించాల్సిన పాలకులకు ఇవేమీ పట్టడం లేదని విమర్శించారు. సిపిఎం చేస్తున్న ఆందోళనకు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని తెలిపారు. సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా నగరంలో రోడ్ల పరిస్థితి మారకపోవడం బాధాకరం అన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వాలు స్పందించకపోవడం విచారకరం అన్నారు. ఈ సమస్య పరిష్కారం చేసేంతవరకు సిపిఎం పోరాటం ఆగదన్నారు. నిరసనలో భాగంగా గురువారం నాడు రహదారి దిగ్బంధన కార్యక్రమం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ప్రకాష్, ఇర్ఫాన్, వలీ, జీవ, రాజు, గఫూర్, లతీఫ్, లక్ష్మీనారాయణ, ఎర్రి స్వామి, వెంకట, హాజీ వలీ, రాముడు, ప్రజానాట్యమండలి శ్రీనివాసులు, పుల్లన్న పాల్గొన్నారు.

స్వీడన్ యూనివర్సిటీ విద్యకు స్పాట్ అడ్మిషన్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం, బ్లెకింగ్ వర్సిటీ (స్వీడన్) సంయుక్తంగా కలిసి అమలు చేస్తున్న ఇంటి గ్రేటేడ్ కోర్సుల్లో సిఎస్‌ఇ విభాగానికి ఒక అడ్మిషన్ జరిగినట్లు డైరెక్టర్ పి.సుజాత తెలిపారు. ఈ అడ్మిషన్లలో సిఎస్‌ఈ రెండు, ఈసీఈ ఏడు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. మిగిలిన సీట్లకు స్పాట్ రిజిస్ట్రేషన్స్ అవకాశం కల్పిస్తున్నట్లు వైస్‌ఛాన్సలర్ హెచ్. సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, డైరెక్టర్ పి.సుజాత తెలిపారు. ఈ కోర్సు ద్వారా విదేశాల్లో ఉద్యోగం సంపాదించడానికి ఇక్కడ విద్యార్థులకు గొప్ప సువర్ణ అవకాశమని విసి తెలిపారు. కోర్సు చదవడానికి సంవత్సరానికి రూ.1.50 లక్షలు ఫీజు ఉంటుందన్నారు.

మిగిలిన సీట్ల కోసం దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి అనంతపురం సిటీ

అనంతపురం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ బాలుర ఐటిఐలో మిగిలిన సీట్లకు మూడవ విడత అడ్మిషన్లకు గడువు పొడగించినట్లు ప్రిన్సిపాల్ రాయపరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 26వతేది లోపు https://iti.ap.gov.in ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు అనంతరం ఒరిజినల్ సర్టిఫికెట్లు 27వతేదీలోపు వెరిఫికేషన్ చేయించుకున్న వారు కౌన్సిలింగ్‌కు అర్హత ఉంటుందన్నారు. 29 వతేదీన కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలియజేశారు

కుల ధ్రువీకరణ సర్వేకు సహకరించండి

ప్రజాశక్తి-యల్లనూరు

ప్రభుత్వ ఆదేశాల మేరకు సుమోటో కుల ధ్రువీకరణ సర్వే నిర్వహించనున్నట్లు తహశీల్దార్ బి.రాము తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో ప్రజలందరూ భాగస్వామ్యం అయ్యి సహకరించాలని కోరారు. ఈ సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలు, ఆదాయ పరిమితి తదితర నమోదు చేయాల్సి ఉందన్నారు.

నూతన మూల్యాంకన విధానంతో నష్టం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పాఠశాలల పరీక్షల నిర్వహణలో నూతన మూల్యాంకన విధానం ఉపాధ్యాయులకు అనేక సమస్యలను తెచ్చిపెడుతోందని, దీనిని ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేష్ రాయల్, ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వపు అధ్యక్షులు బి.నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈవో ఎం.ప్రసాద్ బాబును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నూతన మూల్యంకన విధానంతో పాఠశాలల బోధన సమయం హరించి విద్యార్థులకు నష్టం చేస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి దీనిని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు సర్దార్ వలి, వెంకటరమణ, వన్నప్ప పాల్గొన్నారు.

వీఆర్వో కుమారస్వామిపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

విఆర్వో కుమారస్వామి చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్, సిఐకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జంతలూరు గ్రామ ఎస్సీలు, దళిత సంఘం నాయకులు మాట్లాడుతూ జంతలూరు రెవెన్యూ సర్వేనెంబర్ 276 భూమిని 170 ఎస్సీ కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు కేటాయించారన్నారు. దీనిని విఆర్వో కుమారస్వామి అక్రమంగా తన భార్య పేరుపై ఆన్‌లైన్ నమోదు చేసుకున్నారని తెలిపారు. అక్రమంగా ప్రభుత్వ స్థలాన్ని కాజేసే కుట్ర చేస్తున్న విఆర్వోపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్న ఆంజనేయులు, రామంజి పాల్గొన్నారు

రైతుసంఘం నాయకుడు రాజారామిరెడ్డికి పితృవియోగం

మృతుని కళ్లు దానం

నేత్రదానం సర్టిఫికెట్‌ను అందుకుంటున్న రామకృష్ణారెడ్డి కుమారులు

ప్రజాశక్తి-యల్లనూరు

యల్లనూరు మండలం వెన్నపూసపల్లి గ్రామానికి చెందిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడిపత్రి మండల కార్యదర్శి రాజారామిరెడ్డి తండ్రి జి.రామకృష్ణారెడ్డి గుండెపోటుతో మరణించారు. మంగళవారం రాత్రి తన తండ్రిని గుండెసంబంధిత చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా చుక్కలూరు సమీపంలో రామకృష్ణారెడ్డి హఠాత్తుగా గుండెపోటుకు గురై రాయలచెరువు వద్దకు రాగానే బస్సులోనే మరణించాడు. రామకృష్ణారెడ్డి మతదేహాన్ని స్వగ్రామం వెన్నపూసపల్లికి తీసుకొచ్చారు.

రామకృష్ణారెడ్డి కళ్లుదానం

నాన్న మరణించినా... ఆయన కళ్లు మరో ఇద్దరికి ఉపయోగపడాలన్న ఉద్దేశంతో ఆయన కుమారులు రాజారాం రెడ్డి, సత్యం రెడ్డిలు నేత్రదానానికి ముందుకొచ్చారు. రామయమ్మ ఇంటర్నేషనల్ ఐ బ్యాంక్ వారి ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్సిట్యూట్‌కు రామకృష్ణారెడ్డి కళ్లను అందజేశారు. తండ్రిని కోల్పోయిన విషాదంలో ఆయన కుమారులు రాజారాం రెడ్డి, సత్యం రెడ్డిలు సమాజ హితం కోసం ఆలోచించి తండ్రి నేత్రాలను దానం చేయడానికి అంగీకరించారు. ప్రజాపోరాటంలోనే కాగ సమాజ హితం కోరుతూ వెన్నపూసపల్లి గ్రామంలోని ఈ కమ్యూనిస్టు కుటుంబాన్ని అక్కడి ప్రజలు అభినందించారు.

జెఎన్‌టియు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఏజెన్సీ ద్వారా జీతాలు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సెప్టెంబర్ నెల నుంచి కార్తీకేయ మ్యాన్ పవర్ ఏజెన్సీ ద్వారా జీతాలు చెల్లించ నున్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో పొరుగు సేవలు ద్వారా జీతాలు చెల్లించే పద్ధతికి స్వస్తి పలికి అప్కాస్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగులు జీతాలు చెల్లించారు. అప్కాస్ ద్వారా జీతాలు తీసుకోవడం వల్ల వారి పిల్లలు, కుటుంబాలకు సంక్షేమ పథకాలకు అనర్హులు అయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అప్కాస్ రద్దు చేసి ఇప్పటి వరకు జెఎన్‌టియు ద్వారా జీతాలు చెల్లింపు చేశారు. ఉద్యోగులుకు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం రావాలంటే ఉద్యోగులే నేరుగా కట్టు కోవాల్సివచ్చేది. ఇది సమస్యగా మారడంతో జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శన రావు కమిటీ ఏర్పాటు చేసి తిరిగి పొరుగు సేవలు పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలు పై నివేదికలు కోరారు. కమిటీ ఇచ్చిన సిఫార్సు మేరకు పొరుగు సేవలు అందించే ఏజెన్సీలకు ఆహ్వానం పలుకుతూ గత నెలలో టెండర్‌ను జెఎన్‌టియు పిలిచింది. ఇందులో కార్తికేయ మ్యాన్ పవర్ సర్వేసెస్ అర్హత సాధించింది. ఈ నేపథ్యంలో పొరుగు సేవలు ఉద్యోగులకు సెప్టెంబర్ నెల నుంచి జీతాలు చెల్లించే బాధ్యతను అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

పత్తి దిగుమతులపై సుంకం రద్దు దుర్మార్గం

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్

పత్తి దిగుమతులపై సుంకం రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అత్యంత దుర్మార్గమైనవని, ఇది పత్తి రైతులకు మరణశాసంగా మారే ప్రమాదం ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పత్తిపై దిగుమతి సుంకం తొలగించడం ఆ రైతులపై తీవ్ర ఆర్థిక ప్రభావాన్ని చూపుతాయన్నారు. దేశీయ మార్కెట్లో పత్తి ధర పడిపోతుందన్నారు. ప్రధాని మోడీ ద్వంద్వ వైఖరి రైతాంగానికి తీవ్రంగా నష్టం కలిగిస్తుందని చెప్పారు. ఇప్పటికే జిల్లాలో పత్తి పండించిన రైతులకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలు అయ్యి ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో 11 శాతం దిగుమతి సుంకం తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పత్తి రైతాంగానికి తీవ్రమైన ప్రమాదాన్ని తెచ్చిపెడుతుంది. నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న ఈ రైతు వ్యతిరేక నిర్ణయాన్ని రైతులందరూ ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. పత్తికి మద్దతు ధర అమలు చేసి రైతాంగాన్ని ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పోలీస్ కానిస్టేబుళ్ల శిక్షణకు సన్నాహాలు

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

ఇటీవల ఎంపికైన పోలీస్ కానిస్టేబుళ్లకు త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో అందుకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా పోలీసు శాఖ చేపట్టింది. శిక్షణ నిర్వహించే జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రాన్ని ఎస్పీ పి.జగదీష్ బుధవారం సందర్శించారు. డిటిసి, పరిసర ప్రాంతాలు, మౌలిక వసతులు, బ్యారక్‌లు, కిచెన్, జిమ్, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించారు. శిక్షణ నిమిత్తం అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన ఏర్పాటు చేసుకోవాలని అక్కడి సిబ్బందికి సూచించారు. ఎస్పీ వెంట డిటిసి డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ఐ మధు ఉన్నారు.

ఉచితంగా నూనె గింజల విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ పరిధిలోని కొడిమి పంచాయతీలో రైతులకు ఉచిత ఆముదం విత్తనాలను వ్యవసాయ అధికారులు బుధవారం పంపిణీ చేశారు. జాతీయ ఆహార భద్రత మిషన్ కింద సిఎఆర్‌డి ఎఫ్‌బిఒ సంస్థ - నూనె గింజల పథకం కింద ఆముదం విత్తనాల వేల్యూ చైన్ క్లస్టర్ ద్వారా వీటిని పంపిణీ చేసినట్లు ఎడిఎ అల్తాఫ్ అలీ ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సులోచణమ్మ, వ్యవసాయ అధికారి ఎ.వెంకట్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి మల్లికార్జున, రైతు సేవ కేంద్రం సిబ్బంది సాయి ప్రమోద్, కార్డు సంస్థ ప్రతినిధులు అమరనాథ రెడ్డి, నిర్మల, భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

వికలాంగుల పింఛన్ల తొలగింపు అన్యాయం

బొమ్మనహాల్‌లో అర్జీ ఇచ్చేందుకు వెళ్తూ..

ఆత్మకూరులో అర్జీలు ఇస్తున్న వికలాంగులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ధ్రువీకరణ పత్రాలు సరి చేసుకోవాలని మండల వ్యాప్తంగా 180 మంది పింఛను దారులకు నోటీసులు జారీ చేసినట్లు ఎంపిడిఒ విజయభాస్కర్ తెలిపారు. అలాంటి వారందరూ బుధవారం ఎంపి డిఒ కార్యాలయంలో అర్జీలు ఇచ్చేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు. పింఛనుదారులు మాట్లాడుతూ ప్రభుత్వం మారినప్పుడల్లా ధ్రువీకరణ పత్రాలు సరి చేసుకోవాలనడం సరికాదని మండిపడుతున్నారు. కనీసం నడవలేని వారు, కూర్చోలేని వారు ఎంతో మంది ఉన్నారని, అలాంటి వారు సదరం క్యాంపు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకోవాలంటే చాలా కష్టమవుతుందన్నారు. ఇదిలా ఉండగా ఎంపిడిఒ కార్యాలయం వెళ్లే దారి పూర్తిగా బురదమయమైంది, ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మకూరు : మండలంలో సుమారు 400 పై చిలుకు వికలాంగుల పింఛన్లు ఉండగా సుమారు 291 మందికి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ విషయంపై ఆత్మకూరు ప్రతి వికలాంగుల మండల సమాఖ్య అధ్యక్షుడు ఎగ్గిడి గంగన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వం వచ్చినా వికలాంగుల బతుకులు మారలేదని మండిపడ్డారు. తొలగించిన వికలాంగులకు వెంటనే పింఛన్లను పునరుద్ధరించాలని ఎంపిడిఒ లక్ష్మీనరసింహులుకు వినతి పత్రం ఇచ్చారు. ఎంపిడిఒ మాట్లాడుతూ వైద్యుల పర్యవేక్షణలో అర్హత పొందే ప్రతి ఒక్కరికీ పింఛను మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తొలగించిన అభ్యర్థులు పింఛను రీ వెరిఫికేషన్ కోసం ఎంపిడిఒ కార్యాలయం, మండల వికలాంగుల సమాఖ్య నాయకులకు దరఖాస్తులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు రాజశేఖర్, వన్నూరుస్వామి, సుమారు వంద వికలాంగులు పాల్గొన్నారు.

పింఛన్లలో అర్హులకు అన్యాయం జరగదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శింగనమల

వికలాంగుల పింఛన్ల విషయంలో అర్హులకు ఎవరికీ, ఎలాంటి అన్యాయం జరగదని ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ హామీ ఇచ్చారు. ప్రభుత్వం వెరిఫికేషన్ ప్రక్రియను కేవలం అనర్హులను తొలగించ డానికి మాత్రమే చేపట్టిందన్నారు. అయినా కొందరు అర్హులైన వారి పింఛన్లు పొరపాటున ఆగిపోయి నట్లు మా దృష్టికి వచ్చిందని, అలాంటి వారు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వారి సమస్యలను పూర్తి స్థాయిలో పరిశీలించి, త్వరలోనే తగిన న్యాయం చేస్తామన్నారు. ఇక అనర్హుల జాబితాలో ఉన్న 60 ఏళ్ల దాటిన వారు, వితంతువులు రీ వెరిఫికేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. వారికి వృద్ధాప్య, వితంతు పింఛను మంజూరు చేస్తామన్నారు. అర్హుల పింఛను పొరపాటున ఆగిపోయి ఉంటే సంబంధిత ఎంపిడిఒ కార్యాలయంలో అర్జీ ఇస్తే, మళ్లీ పరిశీలించి మీకు న్యాయం చేస్తారని తెలిపారు.

విద్యారంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా

ప్రజాశక్తి-నార్పల

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు తరిమెల గిరి, సహాయ కార్యదర్శి రాచేపల్లి సూర్య ప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ అరుణ కుమారికి వినతి పత్రం ఇచ్చారు. గిరి, సూర్యప్రకాష్ మాట్లాడుతూ స్థానిక జూనియర్ కళాశాలలో టాయి లెట్లు సరిగా లేవని, ప్రాంగణం తాగుబోతుల అడ్డాగా, అసాంఘిక కార్యకలాపాలు వేదికగా మారిం దన్నారు. గ్రామీణ విద్యార్థులకు వేళకు బస్సు సౌకర్యం లేదన్నారు. బిసి హాస్టల్‌లో సరైన తాగునీటి సదుపాయం లేదన్నారు. దుగుమర్రి, తుంపెర, చామలూరు, నీలితోటపల్లి, తదితర గ్రామాలకు మెరుగైన రోడ్డు సదుపాయం ఉన్నా ఆర్టీసీ బస్సులు గ్రామాల్లోకి వెళ్లకపోవడం వల్ల విద్యార్థులు ఆటోలను ఆశ్రయించి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇలాంటి సమస్యలను విద్యార్థి సంఘాలు ఎత్తి

తహశీల్దార్‌కు వినతి ఇస్తున్న గిరి, సూర్యప్రకాష్

చూపుతాయని, వాటిని కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం విద్యాలయాల్లో ఎస్‌ఎంసి సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులకు మాత్రమే అనుమతించేలా సర్క్యులర్ జారీ చేసిందన్నారు. తక్షణమే ఈ సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని లేకపోతే విద్యార్థి సంఘాలతో విద్యార్థులతో కలిసి చలో కలెక్టరేట్‌కు పిలుపు నిస్తామన్నారు. అలాగే నార్పల లో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ధర్నాలో నాయకులు విజయ్, విద్యార్థులు లక్ష్మీనారాయణ, చిన్నా, కర్నిష్, దినేష్‌కుమార్, శివ, అనిల్, నవదీప్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వసతులతో ఎన్టీఆర్ టౌన్‌షిప్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అహుడా పరిధిలో అభివృద్ధిని విస్తరింపజేసేందుకు ఛైర్మన్ టిసి వరుణ్ వడివడిగా అడుగులు వేస్తున్నారు. రూ. 40 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న పనులకు అంకురార్పణ చేశారు. అందులో భాగంగా బుధవారం అనంతపురం రూరల్ మండలం కందుకూరు సమీపంలోని 80 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ఎంఐజి లేఅవుట్‌లో ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌నకు ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి టిసి వరుణ్ భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. టిసి.వరుణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షను నెరవేర్చే దిశగా పని చేస్తోందన్నారు. మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి ప్రజల అభిలాషకు అనుగుణంగా 80 ఎకరాల సువిశాలమైన విస్తీర్ణంలో అధునాతన సదుపాయాలు, సకల వసతులతో ఈ ఎంఐజి లేఔట్ ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ ఏర్పాటు కాబోతోందన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ

భూమిపూజ చేసిన ఎమ్మెల్యే సునీత, అహుడా ఛైర్మన్ వరుణ్

సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారాయణ సహకారంతో అహుడా సుస్థిర అభివృద్ధికి ఆస్కారం ఏర్పడిందని తెలిపారు. కార్యక్రమంలో అహుడా ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, ఈఈ దుష్యంత్, రాప్తాడు ఇన్‌ఛార్జి సాకే పవన్‌కుమార్, నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శిలు సంజీవరాయుడు, ఇండ్ల కిరణ్‌కుమార్, అవుకు విజయకుమార్, ముప్పూరి కృష్ణ, అహుడా అధికారులు, కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు తీసుకుందాం : ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-అనంతపురం

దోమల నియంత్రణకు చర్యలు తీసుకుందామని ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఒ డాక్టర్ విష్ణు మూర్తి పిలుపునిచ్చారు. నగరంలోని డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో బుధవారం జిల్లా మలేరియా అధికారి ఓబులు ఆధ్వర్యంలో ప్రపంచ దోమల దినోత్సవంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ దోమ కాటు ద్వారా పరాన్న జీవులు మానవులకు మలేరియా వ్యాధిని వ్యాపింప చేస్తాయని ప్రపంచానికి చాటిన సర్ రోనాల్డ్ రాస్‌ను స్మరించుకున్నారు. అలాగే రాస్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఆడ అనాఫిలస్ దోమ కాటు ద్వారా మలేరియా ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుందని రాస్ కనుగొన్నారని, అందుకు గుర్తుగా ఆగస్టు 20వ తేదీన ఏటా ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహిస్తున్నా మన్నారు. దోమల పుట్టుక, వాటి వల్ల

సర్ రోనాల్డ్ రాస్‌కు నివాళులర్పిస్తున్న డా. విష్ణుమూర్తి

వచ్చే జబ్బుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గిరిజా మనోహర్ రావు, ఇన్‌ఛార్జి డెమో త్యాగరాజు, డాక్టర్ సురేంద్ర రెడ్డి, హెచ్ఈఈఓ నాగరాజు, డిప్యూటీ హెచ్ఈవో గంగాధర్, మలేరియా కార్యాలయ విస్తరణ అధికారి గిరిధర్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారులు మద్దయ్య, అబ్దుల్ మునాఫ్, రమేష్, సూపర్వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి, రమేష్, రాఘవేంద్రారెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేల్పుమడుగులో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్లు మండలంలోని వేల్పుమడుగు గ్రామ ఎస్సీ కాలనీలో బుధవారం ఎంపిడిఒ షకీలాబేగం, సర్పంచి తిప్పారెడ్డి పర్యవేక్షణలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ నెల 17వ తేదీ ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనంపై

వేల్పుమడుగు గ్రామ ఎస్సీ కాలనీలో

ప్రజాశక్తి కథనానికి స్పందన

స్పందించిన ఎంపిడిఒ, సర్పంచి ఎస్సీ కాలనీలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అన్ని వీధుల్లో పర్యటించి పారిశుధ్య కార్మికుల చేత రోడ్లకు ఇరువైపులా పారిశుధ్య పనులు చేపట్టారు. నీటి నిల్వలపై బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వర్షాకాలం నేపథ్యంలో కాలనీలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమతెరలు వాడాలని, అవకాశం ఉన్నచోట వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సత్యబాబు, పంచాయతీ సెక్రటరీ అబ్దుల్ మునాఫ్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు అవసరం మేరకే ఎరువులు వాడాలి

యూరియా పంపిణీని పరిశీలించిన కలెక్టర్

రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

రైతులు పంటలకు అవసరం మేరకే ఎరువులు వాడాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. యూరియా కొరత కారణంగా ఉత్పన్నమవుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని బుధవారం ఆయన అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఆర్డీఓ వసంతబాబు, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, మార్క్‌ఫెడ్ డీఎం ఫెన్నేశ్వరితో కలిసి పట్టణంలోని డీసీఎంఎస్ ఎరువుల దుకాణాన్ని సందర్శించారు. ఈ పాస్ మిషన్‌ను పరిశీలించి ఎరువుల పంపిణీ రికార్డులను తనిఖీ చేశారు. ఏఏ ఎరువులు అందుబాటులో ఉన్నాయి.. ఈ ప్రాంతంలో ఏఏ రకాల పంటలు సాగు చేస్తున్నారు.. ఏఏ రకాల ఎరువుల కోసం డిమాండ్ ఉంది.. యూరియా కోసం ఎంతమంది రైతులు వస్తున్నారనే విషయాలను సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. అలాగే అక్కడున్న రైతులతో ఎరువుల ఇబ్బందులు, ఇతర సమస్యలపై ఆరాతీశారు. ప్రయివేట్ యజమాన్యాల్లో అధిక ధరలకు అమ్ముతున్నారని రైతులు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ యూరియా సమస్యను పరిష్కరిస్తామని, అనవసరంగా ఎక్కువ మోతాదులో ఉపయోగించడం మంచిది కాదన్నారు. ఎరువుల అమ్మకంలో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఆర్డీఓ, జేడీఎలు కోరమాండల్‌తో పాటు ఇతర దుకాణా లను తనిఖీ చేశారు. వారి వెంట ఎడిఎ ఎల్లప్ప, డీసీఎంఎస్ సేల్స్ అధికారి విజయ్, ఏఓ శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

నవోదయ విద్యాలయానికి భూమి పరిశీలన

కళ్యాణదుర్గం టౌన్ : జవహర్‌లాల్ నెహ్రూ నవోదయ విద్యాలయం ఏర్పాటు కోసం బుధవారం కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఆర్డీఓ వసంతబాబు, తహశీల్దార్ బాలకిషన్‌తో కలిసి కంబదూరు మండలం చెన్నంపల్లి, పాళ్లూరు గ్రామాల్లో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఇందుకు సంబంధించిన రెవెన్యూ వివరాలను సమగ్రంగా సమర్పించాలన్నారు. ఆ విద్యాలయానికి సంబంధించిన అధికారులతో పలు విషయాలపై చర్చించారు. చెన్నంపల్లిలో తాగునీటి సమస్యను, సూర్యబలిజలకు ఇది వరకూ బిసి కుల ధ్రువీకరణ పత్రాన్ని ఇప్పుడు ఇవ్వడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

పరిశ్రమల ఏర్పాటుతోనే అభివృద్ధి : ఆర్డీవో

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వసంతబాబు

ప్రజాశక్తి-డి.హీరేహాల్

పరిశ్రమల ఏర్పాటుతోనే రాష్ట్రం, గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆర్డీఓ వసంతబాబు తెలిపారు. మండలంలోని డి.హీరేహాల్, హిర్దేహాల్ గ్రామాల పరిధిలో హరి ఓం పైప్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ. 470 కోట్ల వ్యయంతో చేపడుతున్న పరిశ్రమ ఏర్పాటుపై బుధవారం ఎపి కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఆర్డీవో అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు వారి అభిప్రాయాలు తెలిపారు. హిర్దేహాల్ రైతులు మాట్లాడుతూ పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్యం వల్ల ప్రజలు దీర్ఘకాలిక రోగాల బారిన పడుతున్నారని, రైతులకు పంట నష్టం వాటిల్లుతుందన్నారు. కావున పరిశ్రమ యాజమాన్యం రైతులకు తగిన పరిహారం అందించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రధానంగా స్థానికులకు అర్హతను బట్టి ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎపిపి సిబిఆర్ఓ, అనంతపురం ఇఇ కిషోర్‌రెడ్డి, ఎపిపి సిజి జెఇఓ కర్నూల్ రాజశేఖర్, తహశీల్దార్ శ్రీనివాసులు, సిఐ వెంకట రమణ, వారి సిబ్బంది, పరిశ్రమ యాజమాన్యం, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

మెచ్చిరిలో సీతాఫలం వేలం

రాయదుర్గం రూరల్ : మండలంలోని మెచ్చిరి గ్రామ రచ్చకట్ట వద్ద బుధవారం అనుపకొండలో సీతాఫలం ఫల సాయం కోసం డిఎల్‌పిఒ నాగేశ్వర్‌రావు సమక్షంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ వేలం పాట నిర్వహించారు. పట్టణానికి చెందిన వన్నూరుస్వామి రూ. 1.16లక్షలకు దక్కించుకున్నాడు. వేలం ద్వారా గతేడాది పంచాయతీకి రూ. 1.9లక్షలు ఆదాయం వచ్చింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ. 74 వేల ఆదాయం తగ్గింది. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా సీతాఫలం కాపు తక్కువగా ఉండడంతో వేలం పాట తగ్గిందన్నారు. కార్యక్రమంలో మెచ్చిరి చంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర సర్వీసు బోర్డు పెట్టిన బస్సు

అంతర్ రాష్ట్ర సర్వీసులపై మహిళల మండిపాటు

బొమ్మనహాల్ : కర్నాకట సరిహద్దు మండలాల్లోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వర్తించడం లేదు. దీంతో ఈ ప్రాంత మహిళలు ప్రభుత్వ నిర్ణయంపై పెదవి విరుస్తున్నారు. కణేకల్లు క్రాస్ నుంచి బళ్లారికి 50 కిలోమీటర్ల దూరం ఉంది. అయితే కణేకల్లు క్రాస్ వరకే ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. దీనికి తోడు దాదాపు ఈ మార్గంలో రాకపోకలు సాగించే అన్ని బస్సులకు అంతర్ రాష్ట్ర సర్వీసు అంటూ ఎర్రబోర్డు వేసుకుని వెళ్తున్నారు. కర్నాటక సరిహద్దు వరకూ లేకపోయినా కనీసం బొమ్మనహాల్ నుంచి కణేకల్లు, కళ్యాణదుర్గం వెళ్లడానికి కూడా ఉచిత ప్రయాణం వర్తింపచేయకపోవడంపై మహిళలు మండిపడుతున్నారు. సరిహద్దు మండలాల నుంచి కర్నాటక వెళ్లడానికి బస్సు సౌకర్యం లేకపోయినా కనీసం ఆంధ్రలో ప్రయాణించడానికైనా అవకాశం కల్పించాలని కోరుతున్నారు. బొమ్మనహాల్, డి.హీరేహాల్, గుమ్మఘట్ట, విడపనకల్లు మండలాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మహిళలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

ఆత్మకూరు : ఈ ప్రాంత రైతులు, ప్రజల విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టేందుకు మండలంలోని గొరిదిండ్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్‌ను గురువారం ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించనున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారున. కార్యక్రమంలో రైతులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచండి

పుట్లూరు : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని ఎపిఒ తులసిప్రసాద్ టిఎలకు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎపిఒ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో ఫారం పాండ్లు తవ్వాలని, కూలీలకు రోజుకు కనీసం రూ. 300 కూలి అందేలా అవగాహన కల్పించాలన్నారు సోర్ పిట్లు, ఇంకుడు గుంతలు, కొత్తగా హార్టికల్చర్ లిస్టు తయారు చేయాలన్నారు. పశువుల షెడ్స్ పనులు త్వరగా పూర్తి చేయాలని బిఎఫ్‌టి, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో ఈసీ అంజన కుమార్, బిఎఫ్‌టిలు, టిఎలు,ఎఫ్ఎలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రోగులపై వివక్ష తగదు

బ్రహ్మసముద్రం : ఎయిడ్స్ రోగుల పట్ల వివక్షత తగదని రిడ్స్ ప్రాజెక్టు మేనేజర్ మహేష్ తెలిపారు. ఎపి ఎయిడ్స్ నియంత్రణ, రిడ్స్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం చంద్ర మౌళి ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవి, ఎయిడ్స్ సంక్రమణ, లక్షణాలు, ముందస్తు జాగ్రత్తలు, నివారణ, మందులు, సుఖ వ్యాధులు, చికిత్స, కండోమ్ ఉపయోగాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్న చూపు సరి కాదన్నారు. అలానే చెడు వ్యసనాలు, డ్రగ్స్ వాడటం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో కిరణ్ కుమార్, ఎఎన్ఎం వరలక్ష్మి, నాగరాజు, లక్ష్మీదేవి, మరెక్క, తిప్పేరుద్ర, తదితరులు పాల్గొన్నారు.

కడవకల్లు పాఠశాలకు వస్తువుల వితరణ

పుట్లూరు : సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా బుధవారం తాడిపత్రి పట్టణంలోని ఐడబిఐ బ్యాంక్ ప్రతినిధులు మండలంలోని కడవకల్లు మెయిన్ ప్రాథమిక పాఠశాలకు రూ. 1.75 లక్షల విలువ చేసే వస్తువులను అందజేశారు. ఐడిబిఐ బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఆర్.సాయికృష్ణ ఎంఇఒలు శ్రీదేవి, ఎం.ప్రేమ్‌కుమార్ సమక్షంలో హెచ్ఎం వెంకట రామిరెడ్డికి కంప్యూటర్, ఫర్నిచర్, మైక్ విత్ స్పీకర్, తదితర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ఐడిబిఐ బ్యాంక్ డివిజనల్ మేనేజర్ బి.ప్రకాష్. తాడిపత్రి బ్రాంచ్ మేనేజర్ ఎస్. చంద్రశేఖర్, ఎస్ఎంసి ఛైర్మన్ టి.నాగమునీంద్ర, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఐడిబిఐ బ్యాంకు మేనేజర్లు

వికలాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి : సిపిఎం

మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి-గుంతకల్లు

పున్ణపరిశీలన సాకుతో తొలగించిన వికలాంగుల పింఛన్లను తక్షణమే పునరుద్ధరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సిపిఎం నాయ కులు బాధిత వికలాంగులతో కలిసి స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. మారుతి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగుల పింఛన్లు తొలగిస్తూ నోటీసులు ఇవ్వ డంతో వేలాది మంది అర్హులు ఆర్థిక భరోసా కోల్పోయారన్నారు. గుంతకల్లు పట్టణం, మండల పరిధిలోనే 600 వికలాంగుల పింఛన్లు తొలగించాన్నారు. పుట్టుకతోనే మానసిక వికలాంగు లుగా, మూగ, చెవుడు, కంటి చూపు వంటి అంగవైకల్యం ఉండి పింఛను పొందుతున్న లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం పూర్తిగా అన్యాయం చేసిందన్నారు. ఇకనైనా రీ వెరిఫికేషన్ పేరుతో తొలగించిన వికలాంగుల పింఛన్లను తిరిగి పునరుద్ధరించాలని లేనిచో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వికలాంగులతో కలిసి ఈ నెల 22వ తేదీ మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు రమేష్, సాకే నాగరాజు, సురేంద్రబాబు, పట్టణ కమిటీ సభ్యులు వైటి.చెరువు రమేష్, తిమ్మప్ప, వెంకీ, వికలాంగులు పాల్గొన్నారు.

హంద్రీనీవా జలాలతో చెరువులు నింపుతాం

గుత్తి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే జయరామ్


మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న సూర్యప్రతాప్

ప్రజాశక్తి-గుత్తి

హంద్రీనీవా జలాలతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల చెరువులను నింపుతామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తెలిపారు. గుత్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో బుధవారం నూతన ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ టిడిపి జిల్లా అధ్యక్షులు జి.వెంకటశివుడు యాదవ్, కూటమి శ్రేణులతో కలిసి గాంధీ చౌక్ నుంచి మార్కెట్ యార్డ్ వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం యార్డ్ కార్యదర్శి బాలాజీరావు ఛైర్మన్‌గా జక్కలచెరువు సూర్యప్రతాప్, వైస్ ఛైర్మన్‌గా కె.మాలిక్ బాషా, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్ర బాబు నేతృత్వంలో కూటమి పార్టీల కార్యకర్తలందరికీ రాజకీయ భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. గుత్తి మున్సిపాలిటీలో శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం రూ. 250 కోట్లు మంజూరు చేస్తున్నట్లు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ప్రకటించారని గుర్తు చేశారు. గుంతకల్లు అభివృద్ధి కోసం రూ. 42 కోట్లు మంజూరయ్యాయన్నారు. సూపర్ సిక్స్ పథకాలు, ఎన్నికల హామీలు ఒక్కొక్కటి అమలవుతుంటే వైసిపిలో వణుకు పుడుతోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు కూటమి నాయకులకు మాత్రమే ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజలందరూ కూటమి ప్రభుత్వంవైపే ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎడిఎ ఎం.వెంకటరాముడు, ఏవో ముస్తాక్ అహ్మద్, సర్పంచులు పి.భరత్‌కుమార్, యు.రామలింగ మయ్య, గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మ నూ రు ఈశ్వర్, రాజేష్, అంకాల్‌రెడ్డి, వాసగిరి మణికంఠ, ఎంపిటిసి ఎం.ధనుంజయ, టిడిపి పట్టణ, అధ్యక్ష, కార్యదర్శులు ఎంకె.చౌదరి, బి.మారుతి ప్రసాద్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.బర్దివలి, జి.సాంబశివయాదవ్, తొండపాడు, మాముడూరు సింగిల్‌విండో ఛైర్మన్లు ఎస్.శివశంకర్ యాదవ్, పాటిల్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా ఆలం నవాజ్

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డితో ఆలం నవాజ్, ఫిరోజ్‌ఖాన్, నబిరసూల్

ప్రజాశక్తి-గుంతకల్లు

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా పట్టణానికి చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకులు ఆలం నవాజ్ నియమితులయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వై.మధుసూదన్‌రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా ఆలం నవాజ్, ఫిరోజ్‌ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పి.నబిరసూల్‌ను నియమించారు. నవాజ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దేశంలో బలోపేతం అవుతుందన్నారు. అదే బాటలోనే ఎఐసిసి అధ్యక్షురాలు వైస్.షర్మిల కూడా రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. వారి అడుగుజాడల్లో నియోజక వర్గంలో పార్టీ నాయకులను కలుపుకుని అన్ని వర్గాల ప్రజలను కలిసి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. తమకు పార్టీ పదవులు ఇచ్చిన ఎఐసిసి అధ్యక్షురాలు షర్మిల, జిల్లా అధ్యక్షుడు వై.మధుసూదన్‌రెడ్డికి ఆలం నవాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-యాడికి

కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ సమావేశంలో వార్డు సభ్యులు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇన్‌ఛార్జి ఈవో శశికళ ఆధ్వర్యంలో సర్పంచి పందు అనురాధ, ఉపసర్పంచి చంద్రమోహన్ అధ్యక్షతన బుధవారం సాధారణ సమావేశం నిర్వహించారు. కాలనీల్లో డ్రెయినేజీలు, వీధిలైట్లు, పారిశుధ్యం, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై కాలయాపన చేస్తున్నారని, త్వరితగతిన విచారణ చేపట్టి దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక నుంచి గ్రామపంచాయతీ నిధుల మంజూరు విషయమై పాలకమండలి సభ్యులతో చర్చించి మెజారిటీ సభ్యుల ఒప్పందం మేరకే బిల్లులు కానీ తీర్మానాలు కానీ చేయాలని ఇన్‌ఛార్జి ఈవోకు వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది లక్ష్మేంద్ర, శ్రీనివాసులు, వార్డు సభ్యులు తిరుపతి, శ్రీధర్, పరమేశ్వర్‌రెడ్డి, నాగేంద్ర, బాలపెద్దయ్య, రామచంద్ర, శ్రీరాములు, లక్ష్మీదేవి, నాగభూషణం, పద్మావతి, సుధారాణి, సావిత్రమ్మ, పాల్గొన్నారు.

'ఓట్ల చోరీతోనే మోడీ ప్రభుత్వం ఏర్పడింది'

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

బిజెపి ఓట్ల చోరీతోనే కేంద్రంలో రెండు పర్యాయాలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామ్‌భూపాల్‌రెడ్డి ఆరోపించారు. పార్టీ పిలుపుమేరకు బుధవారం ఆ పార్టీ శ్రేణులు పట్టణంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. నాయకులు మాలఎర్రిస్వామి, నాయక్, రాయుడు మాట్లాడుతూ కాంగ్రెస్ ఆర్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఓట్ల చోరీపై పోరాటం చేస్తుంటే ప్రజల నుంచి విశేషమైన స్పందన వస్తుందన్నారు. బీహార్‌లో రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో ఓట్ చోర్.. మోడీ గద్దెచోడ్.. కార్యక్రమం చేపట్టగా ప్రజలు స్వచ్ఛంధంగా పాల్గొనడం చూస్తే ఓట్ల చోరీ విషయం ప్రజలకు తెలిసిపోయిందన్నారు. రాహుల్‌గాంధీ అడుగుజాడల్లో తాము కూడా ఇక్కడ కూడా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. బిజెపి, కేంద్రం దొంగ నాటకాలను ప్రజల ముందుకు తీసుకెళ్లి దోషులుగా నిలబెడతామని స్పష్టం చేశారు.

కొవ్వొత్తుల ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు

కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

IN THE COURT OF THE IIIrd ADDL. JUNIOR CIVIL JUDGE (Excise Court) ANANTHAPURAMU
O.S No:543/2024

Between:
M.Ananthamma ...Plaintiff
AND
V.Nallappa ...Defendant

NOTICE TO THE DEFENDANT

To,
V.Nallappa S/o Nallanna, Hindu, Aged About 50 years, R/at Guntakal Town, Now Residing at Timmampeta Village, Garladinne Mandal, Ananthapuramu District.
పై నెంబరు దావాలోని ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము పై కోర్టు వారు 19-09-2025వ తేది నాటికి వాయిదా వేసినారు, కావున ఆరోజు ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా మీ వకీలు ద్వారా గానీ హజరై ఏమైన అక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హజరు కానీ యెడల పై కేసు మీ పరోక్షము నందు తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
B.RAMACHANDRA,
Advocate, Ananthapuramu,
Cell: 9440243444

IN THE COURT OF THE 2nd ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE,BALLARI.
MVC. No .981/2024

BETWEEN:
Eshwar A ...Petitioner
And
Mallelli Maraja & others ....Defendants

Respondent No.1
Mallelli Maraja S/o Mallelli Thippeswamy, aged about 45 years, Owner of the Motor Cycle bearing Reg. No. AP-39/DM-5735, R/o B.C. Colony, Kadaluru Village and Post, D.Hirehal Mandal, Ananthpuramu, A.P. 515672.

NOTICE

WHEREAS, the above named petitioners has filed the above petition under section 166 of Motor Vehicle Act 1989 against the respondents for the purpose of seeking compensation grievous injuries to petitioner accident took place on 13-05-2025 at about 7.00P.M. at Ballari -Chellakere 150A Road, Near Gowrasamudra Geat, Molakalmur Taluk, Chitradurga District, in the above mentioned address against the respondents No.1

Therefore, If any persons are interested you are hereby directed to appear,in,this court in person or by a pleader duly instructed date 18/9/2025 at about 11.00 a.m to show cause against the above suit, failing which the suit will be heard and determined ex-parte against you.

Given under my hand and seal of the court on this day of 12th August 2025

(By order of the court)

(R.Huliraja) Advocate for the petitioner | Shirestedar chief Administrative Officer, 2nd addl. Dt and Sessions Judge at Ballari

మహారాజ శ్రీ అనంతపురం అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.పి.నెం: 82/2024

Between:
పెళ్ళకూరి రాజా రమేష్ ...పిటీషనర్
AND
తాడిపత్రి మహేష్ మరియు 71 వగైరాలు ...ప్రతివాదులు

నోటీసు టు రెస్పాండెంట్స్

R2: Gajjimekala Jayaraju S/o Anjineyulu, Business, Rajahamsa Villas, Kalyanadurgam Road,
R8: Kuruba Charan Kumar S/o Kuraba Somanath, D.No. 17/345, Neeruganti street,
R9: Rajesh C/o Suresh Paul, D.No. 11-652, Aravind Nagar,
R10: Ramana Reddy, C/o Suresh Paul, D.No.11-652 Aravind Nagar, R2, R8, R9 & R10 are R/o Anantapuramu Town.
R22: Vaddi Nagendra Swamy,Tailors Colony,
R28: Venkatesh, Krishnapuram road,
R39: Ramayanam Srinivasa Rao,2nd road. Sanjeeva Nagar,
R46: Dharakumar, 7th road, Krishnapuram,
R60: Naidu. Sanjeeva Nagar 1st cross,
R64: Gangadhar S/o Nagireddy, Govt. Teacher, Z.P.High School, Kasapuram, Guntakal Mandal,Anantapuramu Dist.
R68: Gopal Reddy, Putluru Road, #3-55,
R69: Kathi Surya Naryana Reddy, 3rd road Krishmapuram, #3-672,
R72: R.Bhaskar Naidu, S/o late. Narasimhulu, D.No.1-168, Jambulapadu Village, Tadipatri Mandal, Anantapuramu Dist(R22 R28 R39,R46 R60, R68 and R69) are R/o Tadipatri Town, Ananthapuramu.

అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడం ఏమనగా పై కేసులోని పిటీషనర్ మీ బాకీలు చెల్లించలేక దివాల తీసి (Insolvency Petition) పై కేసు దాఖలు చేసియున్నాడు. పై కేసు మీ హాజరు నిమిత్తం కోర్టువారు తేది 19-09-2025న వాయిదా వేసివున్నారు. కావున ఆరోజు ఉదయం 10 గంటలకు మీరు స్వయంగా లేదా మీ వకీలు ద్వారా హజరై మీ అక్షేపణలు తెలియజేయవలెను, అట్లు కాని ఎడల కోర్టు వారు మీకు ఎలాంటి అక్షేపణలు లేవని గ్రహించి పై కేసును మీ పరోక్షముగా తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
బి.కుల్లాయప్ప,
పిటీషనర్ తరపు వకీలు, అనంతపురం,
సెల్:9966084311

డెంగీ, మలేరియాపై అవగాహన ర్యాలీ

గాండ్లపెంటలో ర్యాలీ

హిందూపురంలో ర్యాలీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

దోమలు ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకై ప్రజలందరూ ఉమ్మడి భాగస్వామ్యంతో ఉద్యమించాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ తిపేంద్ర నాయక్ తెలిపారు. ప్రపంచ దోమల దినోత్సవం పురస్కరించుకొని వైద్యులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆసుపత్రి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా తిపేంద్ర నాయక్ మాట్లాడుతూ వారం పైబడిన నీటి నిల్వలు తొలగించాలని దోమల పెరుగుదలను నివారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హరి, శ్రీనివాసులు, సురేష్ నాయక్, సబ్ యూనిట్ మలేరియా ఆఫీసర్ జయరాం నాయక్, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల పరిధిలోని కటారుపల్లి క్రాస్ వద్ద ఉన్న కేజీబీవిలో బుధవారం దోమల నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య అధికారి మహేశ్వరి, మారుతి అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ విజయ్ కుమార్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి : ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి విద్యార్థులతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు హరిత, గోవర్ధన్ నాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ రాంకుమార్, హెల్త్ అసిస్టెంట్లు జానకిరామ్, హర్షవర్ధన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ హెూమియోపతి వైద్యురాలు అర్చన పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాపించే టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా లాంటి విష జ్వరాలు బారిన పడకుండా ఉండడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత, ఇంటి పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు బషోబి బేగం, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం : దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకై ఉమ్మడి భాగస్వామ్యంతో ఉద్యమిద్దామని మలేరియా సబ్‌యూనిట్ అధికారి శివన్న పిలుపునిచ్చారు. ప్రపంచ దోమల దినోత్సవం పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు సంయుక్తంగా అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది రాఘవేంద్ర నాయుడు, పిడిఎస్ ప్రసాద్, గోవిందరాజులు, ముస్తఫా, శీను, సురేష్, సాయి ప్రసాద్, శేషు, నాగరాజు, జగదీష్, తిమ్మక్క, ఎర్రమ్మ, సౌభాగ్య, జయశీల, విజయ కుమారి తో పాటు ఆశ ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రి ప్రాంగణం దాటని ర్యాలీ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా చేసిన మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన ర్యాలీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికే పరిమితం కావటంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున దోమలు అధికమై సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి వుంది. ఇటువంటి సమయంలో వైద్య సిబ్బంది గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి. కాని ప్రస్తుత వైద్య సిబ్బంది ఏవైనా కార్యక్రమాలు నిర్వహిస్తే ఫోటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప క్షేత్రస్థాయిలో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

పరిశ్రమ ఏర్పాటులో 'ఉద్యమ్' పత్రం కీలకం

ప్రజాశక్తి - కదిరి టౌన్

వ్యాపార, పరిశ్రమల స్థాపనలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పత్రం చాలా కీలకమైనదని పరిశ్రమల శాఖ అధికారులు పేర్కొన్నారు. ఉద్యమ్ రిజిస్ట్రేషన్, పరిశ్రమల ఏర్పాటుపై బుధవారం స్థానిక ఖాద్రీ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆర్డీవో కార్యాలయ ఏఓ రవికుమార్, పరిశ్రమల శాఖ విస్తరణ అధికారులు సంజీవరాజు, దుర్గేష్, ఓబులేసు పాల్గొని మాట్లాడారు. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పత్రం ఔత్సాహిక, వ్యాపార, పారిశ్రామికవేత్తలకు చాలా ఉపయోగకరమైనదన్నారు. వ్యాపార, పరిశ్రమల స్థాపన లో ఉద్యమ్ ఆధారంగానే బ్యాంక్‌లు రుణాలు, పరిశ్రమల శాఖ నుండి వచ్చే సబ్సిడీలు లభ్యమౌతాయన్నారు. ఔత్సాహిక వ్యాపార, పారిశ్రామికవేత్తలు ప్రభుత్వం నుంచి వచ్చే అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. సరైన అవగాహన లేక దళారులను నమ్మి వేల రూపాయలు నష్టపోతున్నారన్నారు. చాలా సులభతరమైన ఉద్యమ్ రిజిస్ట్రేషన్ కోసం ఔత్సాహికుల ప్రయోజనం కోసం ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. కదిరిలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో సుమారు 150 మంది హాజరవగా 45 మందికి అక్కడికక్కడే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని శ్రీ సత్య సాయి జిల్లా పోలీసులు సూచించారు. జిల్లా ఎస్పీ వి రత్న ఉత్తర్వుల మేరకు పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్ పర్యవేక్షణలో పుట్టపర్తి రూరల్ సిఐ సురేష్, ఎస్ ఐ లు లింగన్న, కృష్ణమూర్తి , సిబ్బంది కలిసి పుట్టపర్తి రూరల్ పరిధిలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల ఇళ్ళల్లో తనిఖీలు నిర్వహించారు. ఎక్కడైనా ఎవరైనా గొడవలు, దౌర్జన్యాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాల్సిన భాద్యత ప్రజల పై ఉందన్నారు. ఎవరైనా గంజాయి, మద్యం అక్రమ విక్రయం వంటివి చేసినా, గొడవలు పడినా పోలీసులకు దృష్టి కి తీసుకురావాలన్నారు.

ఎంపిడిఓను సత్కరిస్తున్న సిబ్బంది

అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి-పామిడి

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అనంతపురంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో ఎంపిడిఓ తేజోష్ణ, వంకరాజుకాలువ సచివాలయ ఆధార్ డిజిటల్ అసిస్టెంట్ షబ్బీర్, పాల్యం ఫీల్డ్ అసిస్టెంట్ శివశంకర్‌నాయుడు మంత్రి పయ్యావుల కేశవ్, ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ నుంచి జిల్లాస్థాయిలో ఉత్తమ అవార్డులు అందుకున్నారు. దీంతో బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వారిని కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో బుధవారం టౌన్ వెండింగ్ కమిటీ ఛైర్మన్ అయిన కమిషనర్ బాలస్వామి అధ్యక్షతన టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో స్ట్రీట్ వెండర్ సర్వే, ఆన్‌లైన్ నమోదు, స్ట్రీట్ వెండర్ గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్‌పై కమిటీ సభ్యులతో చర్చించారు. కమిషనర్ మాట్లాడుతూ స్ట్రీట్ వెండర్ సర్వేలో నమోదు, స్ట్రీట్ వెండర్ గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్‌లు పూర్తి చేయాలని ఆదేశించారు. టౌన్ వెండింగ్ జోన్లలో మార్పులు, స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌పై చర్చించారు. సమావేశంలో హెల్త్ ఆఫీసర్ రంగస్వామి, టిపిఎస్ మంజుల, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ భవాని, సిఎంఎం పి.కాటమయ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డిఎంఎ

నగరంలో నిర్మాణాలపై డిఎంఎ ఆరా

టౌన్ ప్లానింగ్ అధికారులపై ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

'నగర పరిధిలో ఎక్కడ చూసినా నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.. ప్రతి నెలా ఏఏ సచివాలయం నుంచి ఎన్ని దరఖాస్తులు వస్తున్నాయి' అని డిఎంఎ సంపత్‌కుమార్ ప్రశ్నించారు. దీనిపై టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శిరీష, టిపిఎస్ మంజుల సమాధానమిస్తూ 40 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దీంతో డిఎంఎ ఆగ్రహం వ్యక్తం చేస్తూ నగరంలో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలిస్తే మీరు చెబుతున్న లెక్కలకు పొంతనలేదని పేర్కొన్నారు. అలాగే నక్ష ప్రోగ్రాం పనితీరులో సైతం చాలా వెనుకబడి ఉన్నారని హెచ్చరించారు. అంతకుముందు కమిషనర్ బాలస్వామి డిఎంఎకు టౌన్ ప్లానింగ్ సిబ్బందిని పరిచయం చేశారు. దీంతో ఆయన వారిపై ప్రశ్నల వర్షం కురిపించారు.

అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎస్ఆర్ఐటిలో విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-శింగనమల

విద్యార్థి ఆరంభ కార్యక్రమం(స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం)లో భాగంగా బుధవారం మండలంలోని రోటరీపురం గ్రామం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటి కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగా, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్, ఎన్ఎస్ఎస్, యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్‌పై అవగాహన కల్పించారు. నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, సృజనాత్మకత, నాయకత్వం, క్రమశిక్షణ, యాంటీ-ర్యాగింగ్ కమిటీలు, తదితర అంశాలను వివరించారు.

మాజీ మంత్రికి ఆలూరు సాంబశివారెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-శింగనమల

వైసిపి మాజీ మంత్రి కురసాల కన్నబాబుని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి బుధవారం వ్యక్తిగతంగా కలిసి పరామర్శించారు. కన్నబాబు తండ్రి కురసాల సత్యనారాయణ మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సత్యనారాయణ గతంలో కాకినాడ రూరల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా పని చేసి ప్రజలకు విశేషమైన సేవలు అందించారని కొనియడారు. ఆయనతో పాటు పెద్దాపురం, రామచంద్రాపుర నియోజకవర్గాల సమన్వయకర్తలు దొరబాబు, పిల్లి సూర్యప్రకాశ్ ఉన్నారు.

కన్నబాబుతో మాట్లాడుతున్న ఆలూరు



ఎట్టకేలకు డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని డిగ్రీ అడ్మిషన్లు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు మూడు మాసాల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు విడుదలైన తరువాత 3 మాసాల నుంచి వేలాది మంది విద్యార్థులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీలో అడ్మిషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం బుధవారం నుంచి ఇంటర్ విద్యార్థులు డిగ్రీ అడ్మిషన్ల కోసం ఆన్ లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని ఈనెల 26వ తేదీ వరకు గడువు ఇస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. డిగ్రీ కి సంబంధించి కేవలం పది రోజుల్లో ప్రక్రియను పూర్తి చేసే విధంగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చర్యలు ం చేపట్టింది. ఈ విషయంపై బుధవారం ఎస్ ఎస్ పి ఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి మాట్లాడుతూ 2025 26 విద్యా సంవత్సరానికి బీఏ బీఎస్సీ బీకాం కోర్సులలో ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం విద్యార్థులు రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులకు ఈనెల 24వ తేదీ నుంచి 28 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు అన్నారు. రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులకు ఈనెల 31వ తేదీన సీట్ల కేటాయింపు వివరాలు తెలుస్తాయన్నారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి-హిందూపురం

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో హిందూపురం రూరల్ మండలపరిధిలోని బలంపల్లి చలివెందల గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణయ్య తో పాటు వ్యవసాయ పరిశోధన కేంద్రం, వ్యవసాయ శాస్త్రవేత్త భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎండు తెగుళ్ల, కత్తెర పురుగు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి రైతులకు వివరించారు. అదేవిధంగా కలుపు నివారణ గురించి రైతులకు సూచించారు. ప్రధాన శాస్త్రవేత్త ఆచారి మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల అనుగుణంగా ఎరువుల వాడకం గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది సురేష్, గౌతమి, రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై నేడు నిరసన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

అంగన్‌వాడీల సమస్యలపై గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టాలని అంగన్‌వాడీ వర్కర్స్, జిల్లా యూనియన్ అధ్యక్షురాలు శకుంతల బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. వేతనాల పెంపు, సమ్మె కాలపు వేతనాలు, ఎఫ్ఆర్ఎస్ రద్దు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు, గ్రాట్యుటీ జీవో మార్పు, అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా మార్చాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

23న పివికెకెలో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న పివికెకె డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 23వ తేదీ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్లేస్‌మెంట్ డీన్ డా. సి.భానుకిరణ్, ప్రిన్సిపల్ డా. రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. బీఎస్సీ, బిసిఎ కోర్సుల్లో(2022-25) ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. ఆన్‌లైన్ పరీక్ష, ముఖాముఖి ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారన్నారు. ఉద్యోగం చెన్నైలో చేయాల్సి ఉంటుందని, ఏడాదికి రూ. 3 లక్షల వేతనం, భోజనం, రవాణా సౌకర్యం కల్పిస్తారన్నారు.

పింఛన్లు పునరుద్ధరించాలని రేపు ధర్నా

ప్రజాశక్తి-రాప్తాడు

మండలంలో అర్హులందరికీ షరతులు లేకుండా వికలాంగుల పింఛను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22వ తేదీ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద చేపట్ట నున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాప్తాడు రూరల్ ప్రాంతీయ కార్యదర్శి టి.రామాంజనే యులు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 680 మంది వికలాంగులకు నోటీసులు ఇవ్వడం బాధాకరమన్నారు. పింఛన్ల అంశంపై సిపిఎం ఆధ్వర్యంలో చెర్లోపల్లి గ్రామంలో ప్రత్యక్షంగా పరిశీలించామన్నారు. మంచానికి పరిమితమైన వారికి రూ. 15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ కమిటీ సభ్యులు పోతలయ్య, మల్లేష్, సుబ్బారావు, ప్రతాప్, మధు, లక్ష్మన్న పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని తోపుదుర్తి గ్రామంలో బుధవారం రైతు సేవా కేంద్రం ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.పద్మలత ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వాతావరణ ఆధారిత వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, నానో యూరియా, నానో డిఏపి వాడటం వల్ల కలిగే లాభాలు, జీవన ఎరువులు వాడటంలో మెలకువలు, భూసార పరీక్షలు, ఆ ఫలితాల ద్వారా ఎరువుల యాజమాన్యం, వివిధ పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఇఒలు అలేఖ్య, అక్కమ్మ, రైతు సేవా కేంద్ర సిబ్బంది నరసింహులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాజీగా మౌలానా అల్హాజ్

ప్రభుత్వ ఖాజీగా నియామక పత్రం అందుకుంటున్న రెహమాన్ సాహెబ్

ప్రజాశక్తి-పామిడి

పట్టణ ప్రభుత్వ ఖాజీగా మౌలానా అల్హాజ్ ఫజ్లూర్ రెహ్మాన్ సాహెబ్ ఎంపికయ్యారు. ఆయన మాట్లాడుతూ తనను ఖాజీగా ఎంపిక చేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, గుమ్మనూరు ఈశ్వర్, కలెక్టర్ వినోద్ కుమార్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాకు అప్పజెప్పిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని, ఇచ్చిన పరిధిని అతిక్రమించకుండా సేవలు అందిస్తానని తెలిపారు. అందుకు పట్టణంలోని ముస్లింలందరూ సహకరించాలని కోరారు.

ప్రపంచ దోమల దినోత్సవంపై అవగాహన

ప్రజాశక్తి-యాడికి

స్థానిక నెంబర్-1 పాఠశాలలో బుధవారం డాక్టర్ సాయిసుమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రపంచ దోమల దినోత్సవంపై అవగాహన కల్పించారు. దోమల వల్ల వచ్చే మలేరియా డెంగీ, మెదడువాపు, చికెన్ గున్యా, బోధకాలు, తదితర వ్యాధులు, టీటీ వ్యాక్సినేషన్ గురించి వివరించారు. అలాగే ఈ నెల 12వ తేదీ పాఠశాలకు హాజరు కాని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అనంతరం ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, హెచ్ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, హెల్త్ అసిస్టెంట్ మద్దిలేటి, ఎఎన్ఎం స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పి శ్వేతామాధురి, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి , మహబూబ్‌బి, సుజాత పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి : సిఐ

ప్రజాశక్తి-శింగనమల

వినాయక చవితి ఉత్సవాలకు తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌లో అనుమతి పొందాలని సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల నిర్వహణకు ఎక్కడా ఎలాంటి చలానా కట్టాల్సిన అవసరం లేదన్నారు. పోలీసుల అనుమతి మాత్రం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఉత్సవాలు మూడు రోజులు మాత్రమే జరుపుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిమజ్జన ఊరేగింపులో అవాంఛనీయ సంఘటనలు జరిగితే బాధ్యులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిఐ కౌలుట్లయ్య

మాదకద్రవ్యాల వాడకంతో అనర్థం

ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డా॥ఎన్ఎవి.ప్రసాద్

డ్రగ్స్ నియంత్రణ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యం, సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

మాదకద్రవ్యాల వాడకం సామాజిక, మానసిక శారీరక సమస్యలకు దారితీస్తుందని అనంతపురం ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ఎవి.ప్రసాద్ తెలియజేశారు. ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాలలో నషా ముక్త భారత్ అభియాన్ ప్రోగ్రామ్ లో భాగంగా డ్రగ్స్ అలవాట్లకు వ్యతిరేకంగా సామూహిక ప్రమాణం తీసుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు గుట్కా, సిగరెట్, తంబాకు, గంజాయి వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వీటి వాడకం వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఈగల్ సెల్ ఇన్‌ఛార్జి సబ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి.హనుమంతు, ఆర్ట్స్ కాలేజీ లెక్చరర్ బృందా, డిసేబుల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారి అనిల్ కుమార్, జాతీయసేవా పతకం పీవో జి.ఆనంద్ బాబు, టి.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

రైతుల యూరియా కష్టాలు ప్రభుత్వానికి పట్టవా : వైసిపి

ప్రజాశక్తి-కుందుర్పి



వ్యవసాయ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న వైసిపి నాయకులు

మండల వ్యాప్తంగా యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు ప్రభుత్వానికి పట్టవా అని వైసిపి మండల కన్వీనర్ హనుమంతరాయుడు ప్రశ్నించారు. రైతులకు తక్షణమే తగినంత యూరియా అందించాలని కోరుతూ బుధవారం ఆయన రైతులతో కలిసి మండల వ్యవసాయ అధికారి విజయ కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులు వరి, వేరుశనగ, కంది, పత్తి, మిరప, టమోటా, మొక్కజొన్న, తదితర పంటలు సాగు చేశారన్నారు. రైతుకు 2 బస్తాలు చొప్పున మండల వ్యాప్తంగా సుమారు వంద మెట్రిక్ టన్నుల యూరియా అవసరమన్నారు. అయితే ప్రభుత్వం ఆ మేరకు రైతులకు యూరియా అందించ డంలో విఫలమైందన్నారు. ఏవో మాట్లాడుతూ మండలానికి వచ్చిన వెంటనే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు రైతులకు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి మారుతీశ్వర రామ్మూర్తి, నాయకులు మంజునాథ, నరేష్, హనుమేష్, రాజగోపాల్, మల్లి, ఆంజి, దాసరి క్రిష్టప్ప, శివశంకర్, వన్నూరప్ప, తిమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

నానో డిఎపి వాడకంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-నార్పల

అవగాహన కల్పిస్తున్న ఇఫ్కో ఎరువుల ప్రతినిధులు

మండలంలోని కేశేపల్లి గ్రామంలో బుధవారం రైతులకు నానో యూరియా, నానో డిఎపి వాడ కంపై ఇఫ్కో ఎరువుల కంపెనీ వారితో కలిసి ఏవో చెన్నవీరస్వామి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. నానో యూరియా, డిఎపి పిచికారి చేయడం వల్ల భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు, అతి తక్కువ ఖర్చుతో పంటల్లో ఎక్కువ దిగుబడి తీసుకురావచ్చు అన్నారు. నేల సారాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సరైన సమయంలో మొక్కకు పోషకాలు అందించవచ్చు అన్నారు. పర్యావరణ కాలుష్యం కూడా తగ్గించవచ్చు అన్నారు. రైతు వెంకటరామిరెడ్డి పొలంలో వరి పంటలో నానో డిఎపి ఎరువును పిచికారి చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇఫ్కో కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ మణికళ్యాణ్, ఎఇఒ ప్రసాద్, గ్రామ వ్యవసాయ అధికారి పోతులయ్య, రైతులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ పరిశీలన

రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ బ్రహ్మయ్య

ప్రజాశక్తి-కణేకల్లు

మండలంలోని బ్రహ్మసముద్రం, బెనికల్ గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో జరుగుతున్న యూరియా పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం తహశీల్దార్ బ్రహ్మయ్య, మండల వ్యవసాయ అధికారి జగదీష్ పరిశీలించారు. వారు యూరియా నిల్వలు, రైతులకు ఏ విధంగా పంపిణీ చేస్తున్నారనే విషయాలపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులతో మాట్లాడుతూ యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి రైతుకు అందజేస్తామని భరోసా ఇచ్చారు.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం

ప్రజాశక్తి-శింగనమల

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని మండలంలోని తరిమెల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ తెలిపారు. మండలంలోని నాగులగుడ్డం, తండా, వెస్ట్ నరసాపురం, చిన్నజలాలపురం గ్రామాల్లో బుధవారం వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న రోగులకు చికిత్స చేయడంతో పాటు ఇంటింటి సర్వే నిర్వహించారు. కీటక జనిత వ్యాధులైన డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో జ్వరంతో ఉన్న ఆరుగురి రక్త పూతలు సేకరించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు చంద్రశేఖరరెడ్డి , సిబ్బంది గీత, రమణయ్య, ఆంజనేయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.